ఆశాజనకంగా మినుము సాగు

- నియోజకవర్గంలో 45 వేల ఎకరాల్లో సాగు
- పెడన, గూడూరు మండలాల్లో దాళ్వా కంటే అధికం
- క్వింటా మినుముకు రూ.7,500లకు పైగా మద్దతు ధర

పెడన: ఈ ఏడాది మినుము సాగు ఆశాజనకంగా ఉంది. తెగుళ్లు తక్కువగా ఉండటంతోపాటు వాతావరణం అనుకూలించింది. తెగుళ్లు అక్కడక్కడా కనిపించినా దిగుబడులపై అంతగా ప్రభావం చూపవు. ప్రభుత్వం క్వింటా మినుముకు రూ. 7,500పైగా మద్దతు ధర ప్రకటించడంతో రైతులు ఖుషీగా ఉన్నారు.

పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు మండలాల్లో దాళ్వా కంటే మినుము అధికంగా సాగు చేశారు. బంటుమిల్లిలో అక్కడక్కడా, కృత్తివెన్నులో తక్కువగా సాగుచేశారు. మినుము పైరు బాగుండటంతో దిగుబడులపై రైతులు ఆశతో ఉన్నారు. మరో పక్క ఇప్పటికే మినుము తీత పనులు కొనసాగుతున్నాయి. మహా శివరాత్రి తరువాత మినుము తీత పనులు ఊపందుకుంటాయని రైతులు స్పష్టం చేస్తున్నారు.

45 వేల ఎకరాల్లో సాగు..

పెడన నియోజకవర్గంలోని గూడూరు మండలంలో అత్యధికంగా 18,406 ఎకరాల్లో మినుము సాగులో ఉంది. పెడన మండలంలో 17,007 ఎకరాల్లో, బంటుమిల్లిలో 8,290 ఎకరాల్లో, కృత్తివెన్నులో 1,787 ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారు. గత రెండేళ్లగా మినుము పంటలను పల్లాకు, తలమాడు తెగుళ్లు, పూత దశలో నీరందక ఎండిపోవడంతో రైతులు నష్టాలకు గురయ్యారు. ప్రస్తుతం ఆరుతడి బాగానే ఉండటంతో పాటు తెగుళ్లు కూడా అక్కడక్కడా ఉన్నా వాటికి సస్యరక్షణ చర్యలు చేపట్టడం, నివారణ మందులు పిచికారీ చేస్తుండటంతో మినుము పైరు ఆశాజనకంగా ఉంది. మినుము పంట చేతికి వచ్చేందుకు మినుము తీత, పోతకు సుమారు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు రైతులు ఖర్చుపెడుతున్నారు.



తీతకు సిద్ధంగా ఉన్న మినుము పైరు

ముందుగానే మద్దతు ధర ప్రకటన

మినుము ధర క్వింటాకు రూ.7,500 పలుకుతోంది. ఈ ధర కంటే తక్కువగా ఉంటే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని రైతులకు అధికారులు తెలియజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మినుము ధర లేక, గత ఐదేళ్లుగా దాళ్వా లేక అపరాలపై ఆధారపడిన రైతులు కూడా అపరాల కింద వేసిన మినుముకు మద్దతు ధర లభించకపోగా తీవ్రంగా నష్టపోతూ వచ్చారు. పంటల దిగుబడి కూడా బాగా తగ్గింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మినుము రైతులకు మద్దతు ధర ముందుగానే ప్రకటించడంతో పాటు అవసరమైతే కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామని తెలియజేయడంతో రైతులు హర్షం వ్యక్తమవుతుంది.

గతం కంటే చాలా మెరుగు



ఆరేడేళ్లుగా దాళ్వా లేక ప్రత్యామ్నాయంగా చాలా మంది రైతులు అపరాలు సాగు చేస్తున్నారు. మినుము విషయంలో తీవ్రంగా నష్టాలు చవి చూశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పైరు బాగానే ఉంది. గతంలో క్వింటా ధర రూ.4 వేలు, రూ.5,700 ఉండేది. ఇప్పుడు ధర రూ.7,500 ఉంది. ఈ ధర రూ.10 వేల వరకు వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. దీంతో లాభాలు వస్తాయని రైతులు భావిస్తున్నారు.

– వన్నెంరెడ్డి మహంకాళరావు, రైతు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



పెడన, గూడూరు మండలాల్లో దాళ్వా కంటే మినుము అధికంగా రైతులు పండిస్తున్నారు. దీంతో రైతులు వ్యయం తగ్గించుకునేలా ఎప్పటికప్పుడు ఆత్మ, పొలంబడుల ద్వారా యాజమాన్య పద్ధతులు తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్నాం. ప్రస్తుతం మినుము పైరు ఆశాజనకంగా ఉంది. తెగుళ్లు కూడా పెద్దగా కనిపించడం లేదు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా సూచనలు ఇస్తున్నాం.

– జీవీ శ్రీనివాసరావు, ఏడీ ఇన్‌చార్జి, మచిలీపట్నం, పెడన ఏఓ

అన్ని వర్గాలను ఆదుకుంటున్న సీఎం జగన్

- ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన బందరు కౌన్సిల్
- అజెండాలోని 12 అంశాలకు ఆమోదం

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రతి ఒక్కరు శ్లాఘిస్తున్నారని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో గురువారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని పెంచి ప్రతి నెలా లబ్ధిదారులకు రూ. 2,750 ఇస్తున్నారని చెప్పారు. నగరంలోని 731 మందికి జగనన్న తోడు పథకం ద్వారా రూ. 10 వేలు వడ్డీలేని రుణాన్ని అందించారన్నారు. చేదోడు పథకం ద్వారా 760 మందికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారన్నారు. విదేశీ విద్య ద్వారా నగరానికి చెందిన ఓ విద్యార్థికి రూ. 11.62 లక్షలను జమ చేశారన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం ద్వారా 8 జంటలకు సాయం అందించారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోను 98 శాతం అమలు చేసి మనసున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరొందారన్నారు. 13 అంశాలతో రూపొందించిన అజెండాలో 12 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 11వ అంశాన్ని తిరస్కరించారు. కాగా టేబుల్ అజెండాగా ఉంచిన మార్కెట్లకు పలు రకాల సరుకులను తీసుకువచ్చే లారీల నుంచి రుసుం వసూలు చేసేందుకు తీర్మానం చేశారు.



సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు (ఇన్‌సెట్) సభ నిర్వహిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

12 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం..

నగరంలోని ఆరు మార్కెట్లకు వచ్చే సరుకు లారీల నుంచి మాత్రమే రుసుం వసూలు చేయాలని తీర్మానించారు. రెండో టేబుల్ అంశం విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బకాయిలను రూ. 7.59 కోట్లు బకాయిలను చెల్లిస్తే రూ. 3.62 కోట్లు సర్‌చార్జి మినహాయింపు వస్తున్నందున బకాయిలను చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 44వ డివిజన్‌లో ఉన్న మాకర్ల వెంకటస్వామి నాయుడు మునిసిపల్ పార్కు అభివృద్ధి పనులు చేయించేందుకు మేయర్ వెంకటేశ్వరమ్మ ముందస్తు ఆదేశాలు ఇచ్చిన అంశాలకు సమావేశం ఆమోదం తెలిపింది. కాగా టీడీపీ సభ్యులు పనులు పూర్తి కాకుండానే ముందస్తు ఆదేశాలు ఏమిటని ప్రశ్నించారు. దీనికి 18వ డివిజన్ కార్పొరేటర్ మేకల సుబ్బన్న ముందస్తు ఆదేశాలంటే తెలియకుండా సభలో టీడీపీ సభ్యులు ఎలా ప్రశ్నిస్తున్నారన్నారు. ఈనెచీపుర్ల కొనుగోలు అంశం సమయంలో పారిశుధ్య కార్మికులు చీపుర్లు లేక చెట్లకు ఉన్న ఈనెలను తీసుకుని చీపుర్లు తయారుచేసి రోడ్లు ఊడుస్తున్నారంటూ టీడీపీ సభ్యులు సభ దృష్టికి తీసుకురావడంతో డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మేకల సుబ్బన్న వారి వాదనను తప్పుపట్టారు. మునిసిపల్ కార్యాలయ ప్రహరీ నిర్మాణం అంశంపై కూడా టీడీపీ సభ్యులు పసలేని వాదనలు చేశారని పలువురు వ్యాఖ్యానించారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, కమిషనర్ సీహెచ్ చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె. చంద్రిక, ఎంఈ శ్రీకాంత్,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాలకు అధికారులు హాజరుకావాల్సిందే

గైర్హాజరుపై మండల పరిషత్ సభ్యుల ఆగ్రహం

అవనిగడ్డ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తుంగల సుమతీదేవి అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశానికి అగ్నిమాపక, ఎక్సైజ్, పోలీస్, ప్రభుత్వ వైద్యులు గైర్హాజరయ్యారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా మాట్లాడుతూ ముఖ్యమైన సమావేశానికి అధికారులు హాజరుకాకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశాలకు అధికారులు అంతా హాజరయ్యేలా చూడాలని ఎంపీపీ సుమతీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజకు విన్నవించారు. ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని చెప్పారు. ఈసారి జరిగే సమావేశానికి సంబంధిత అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీపీ చెప్పారు. తహసీల్దార్ ఎల్‌వీఎస్ రామకృష్ణ, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, వైస్ ఎంపీపీలు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమతీదేవి

మహా శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

ఎడ్లంక(అవనిగడ్డ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎడ్లంకలో బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయడంతో పాటు ఆలయం ముందు చలువ పందిరి వేస్తున్నారు. పితృదేవతలకు పిండార్పణ చేసేందుకు అనువుగా నదీ తీర ప్రాంతంలో ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి శుభ్రం చేశారు. పుష్కరఘాట్ నుంచి గ్రామ పొలిమేర వరకూ రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి పారిశుధ్య పనులు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు పెనుమూడి బాలకృష్ణ, గ్రామ ప్రముఖులు పాలెపు వెంకటేశ్వరరావు, వీఆర్వో, వీఆర్ఏ, సచివాల సిబ్బంది పర్యవేక్షించారు.



ఎడ్లంక ఆలయం వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

మల్లవోలు విద్యార్థుల ప్రతిభ

గూడూరు: విప్రో సైన్స్ ప్రాజెక్టుల్లో మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ప్రథమస్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పాండురంగారావు తెలిపారు. బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ పసుపులేటి సురేష్‌బాబు, విప్రో ఎరెత్తిన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కాకాని వెంకటరత్నం చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. గత ఏడాది నిర్వహించిన పోటీల్లో కూడా పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించడం విశేషం. విద్యార్థులను, వారిని గైడ్ చేసిన ఉపాధ్యాయులు ఎస్.అరుణ, ఎస్.శ్రీనివాస్‌లను గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పర్లం పెదబాబు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, ఎంపీటీసీ మెట్ల సాయికుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.నరసింహారావు అభినందించారు.



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

గ్రామీణులకు బ్యాంక్ సేవలు చేరువ

ఎస్‌బీఐ లక్ష్మీపురం బీఎం ఆనంద్ కుమార్

లక్ష్మీపురం (చల్లపల్లి): గ్రామీణ ప్రాంత వినియోగదారులకు బ్యాంక్ సేవలను చేరువ చేస్తోందని ఎస్‌బీఐ లక్ష్మీపురం బ్రాంచ్ మేనేజర్ కె.ఆనంద్ కుమార్ తెలిపారు. లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురంలో గురువారం నూతన కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను బీఎం ప్రారంభించారు. ఈ కేంద్రంలో జన్‌ధన్ ఖాతా ఓపెనింగ్, ఆధార్ కార్డ్ ద్వారా నగదు డిపాజిట్లు–విత్‌డ్రాలు, ఫండ్ ట్రాన్స్‌ఫర్, బ్యాలెన్స్ ఎంక్వైరీ, నగదు బదిలీ, ఏటీఎం కార్డ్ ఆధారిత లావాదేవీలు, ఆధార్ ఆధారిత చెల్లింపులు, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ఆధార్ సీడింగ్, లోన్ రీపేమెంట్, పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలు లభిస్తాయని వివరించారు. పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని), నిర్వాహకులు అబ్దుల్ నజీర్, మహమ్మద్ ఖమ్రుద్దీన్ పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వారి కల్యాణోత్సవం

మోపిదేవి: మోపిదేవిలోని సకలేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రసాద్ ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పెండ్లికుమారునిగా అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక పల్లకీలో గ్రామోత్సవం, ఎదుర్కోలోత్సవం జరిగాయి. రాత్రి స్వామి వారికి అడుసుమిల్లి నాగేశ్వరరావు దంపతులచే దివ్య కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందజేత



కృత్తివెన్ను: దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్‌కు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వారికి అవసరమైన ఉపకరణాలను సైతం అందజేస్తోందని ఎంపీపీ గరుడప్రసాద్ అన్నారు. నీలిపూడి నాన్ భవిత కేంద్రంలో దివ్యాంగులకు రెండు వినికిడి యంత్రాలు, రెండు వీల్‌చైర్‌లను గురువారం అందజేశారు. ప్రభుత్వం తరఫున అందుతున్న అన్ని రకాల సదుపాయలతో పాటు, ఉపకరణాలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థుల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సర్పంచ్ పి. కృష్ణ, ఎంపీటీసీ పి. సుజాత, ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు లక్ష్మీ, లావణ్య, సీఆర్‌పీ తంబిబాబు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 24వ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా అరుణ కుమారి



చల్లపల్లి: చల్లపల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎ.అరుణ కుమారి నియమితులయ్యారు. మోపిదేవిలో ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి చల్లపల్లికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం అరుణ కుమారి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆమెకు కార్యాలయ ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ బూరేపల్లి అశోక్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు.

హైకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం

చిలకలపూడి: మచిలీపట్నం వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు సి.ప్రవీణ్‌కుమార్, ఎ.వి. శేషసాయి, ఎన్. జయసూర్య, ఎ.వి.కృపాసాగర్, గ్రంధి భవానీప్రసాద్‌కు కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ జాషువా గురువారం పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ అతిథిగృహంలో హైకోర్టు న్యాయమూర్తులు కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ పి.జాషువా స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తి సి.ప్రవీణ్‌కుమార్ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అతిథిగృహంలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికతో కలిసి పలు అంశాలపై చర్చించారు.



హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

జిల్లా గ్రంథాలయం పరిశీలన

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ గురువారం పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తక విభాగం, పాఠకుల పఠనా విభాగం, కంప్యూటర్ విభాగాలను పరిశీలించారు. పుస్తక విభాగంలో పుస్తకాలను ఏ విధంగా భద్రపరుస్తున్నదీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు కావాల్సిన పుస్తకాలను వెంటనే తీసుకునేలా పుస్తకాలను ర్యాక్‌లలో ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. మొవ్వ మండలంలోని కాజ, మొవ్వ శాఖ గ్రంథాలయాలను ఆమె పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ ఇంటి వీరవెంకట రామారావు, రికార్డ్ అసిస్టెంట్ కె. రాంబాబు పాల్గొన్నారు.

లైబ్రేరియన్ వెంకటేశ్వరమ్మకు సన్మానం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కోన వెంకటేశ్వరమ్మను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ గురువారం ఘనంగా సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ ఇంటి వీరవెంకట రామారావు, రికార్డ్ అసిస్టెంట్ కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



లైబ్రేరియన్ వెంకటేశ్వరమ్మను సత్కరించిన చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ

సోము వీర్రాజుపై కన్నా వ్యాఖ్యలు అర్థరహితం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజబాబు

కృత్తివెన్ను: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై కన్నా లక్ష్మీనారాయణ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అర్థరహితమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు అన్నారు. కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యలను ఖండించారు. కృత్తివెన్ను పల్లెపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు నడ్డాకు లేఖ రాసి ఇప్పుడు సోము వీర్రాజుపై లేనిపోని ఆరోపణలు చేయడం కన్నాకు తగదన్నారు. అనంతరం బీజేపీ కృత్తివెన్ను మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ ఏసురాజును ఎన్నుకున్నారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు పుప్పాల రాము పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



పెడన: మండలంలో రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ జీవీ శ్రీనివాసరావు అన్నారు. పెనుమల్లి, పుల్లపాడు, చోడవరం, కమలాపురం రైతు భరోసా కేంద్రాలను, ఆయా ప్రాంతాల్లోని మినుము పంటలను, ఈ క్రాప్, ఈకేవైసీలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 72 శాతం మాత్రమే ఈకేవైసీ చేశారని చెప్పారు. రైతు భరోసాతో పాటు సబ్సిడీపై ఇచ్చే యంత్ర పరికరాలు, విత్తనాలు కూడా ఈక్రాప్‌లో నమోదు అయి ఉంటునే అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు గోపి, ఎండీ సాద్ అహ్మద్, ఎస్. శిరీష, బి. సాయిరామ్, రైతులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ మచిలీపట్నం 6వ అదనపు జిల్లా జడ్జి సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 1/2021
ఇన్
ఓ.యస్.నెం.43/2017

మధ్య :
గుడివాడ గంగాధరరావు – డి.హెచ్.ఆర్.
మరియు
అడపా వెంకట నాంచారమ్మ – జె.డి.ఆర్.
టు
అడపా వెంకట నాంచారమ్మ
భర్త : వీరేశ్వరరావు, డోర్ నెం: 1/36,
ఉల్లిపాలెం, బందరు మండలం, మచిలీపట్నం.

పై నెంబరులో జె.డి.ఆర్. అయిన మీకు అనేక పర్యాయములు ఆర్డరు 21, రూల్ 64 ప్రకారము వేలం నోటీసు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు పేపరు ప్రకటనకు ఆర్డరు 21, రూల్ 64 ప్రకారము వేలం కొరకు ఆర్డరు వేస్తూ మీ యొక్క హాజరు నిమిత్తం ది.03.03.2023కి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై తమకు గల అభ్యంతరాలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము//
ఇట్లు, కె.వి. సాయిబాబు,
వాయిదాతేది. 03.03.2023 అడ్వకేట్, మచిలీపట్నం

క్లుప్తంగా

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి



చిలకలపూడి(మచిలీపట్నం): ఈడేపల్లిలోని జట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కేవీ రామకృష్ణయ్య సందర్శించారు. ఆశ్రమంలో వృద్ధులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార పదార్థాలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ సంస్థకు దరఖాస్తు చేసుకుంటే న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. న్యాయవాదులు చీలి ముసలయ్య, అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే



గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గూడూరు మండలంలో రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. గంధ్రం గ్రామంలో రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ గురువారం పరిశీలించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి సర్వే నెంబర్‌లో రీ సర్వే జరుగుతోందన్నారు. ఏ రోజు ఏ సర్వే నెంబర్‌లో సర్వే నిర్వహిస్తారన్న విషయాన్ని రెవెన్యూ రికార్డుల పరంగా ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. నోటీసులు అందుకున్న రైతులు తప్పనిసరిగా ఆ రోజు తమ పొలాల వద్ద సర్వే అధికారులకు అందుబాటులో ఉండాలని కోరారు. తద్వారా రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించి ఖచ్చితమైన హద్దులు గుర్తించడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో బషీర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి భూమి పూజ

గూడూరు: రాయవరం గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ధర్మ శాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించనున్నారు. రేపల్లె శంకర గురుస్వామిచే ఆలయ నిర్మాణానికి భూమి పూజ, గణపతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచి నందం మల్లీశ్వరి, రవికిరణ్, యార్లగడ్డ రాఘవులు, మునగాల కోటేశ్వరరావు, మునగాల వేమన, జానం కృష్ణ, ఆత్మూరి వెంకటేశ్వరరావు, కె. వెంకట్రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: మహా శివరాత్రిని పురస్కరించుకుని మోపిదేవి మండలం పెదకళ్లేపల్లికి శుక్ర, శని వారాల్లో పలు ప్రాంతాల నుంచి పెదకళ్లేపల్లికి ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. అవనిగడ్డ, చల్లపల్లి, మచిలీపట్నం నుంచి పెదకళ్లేపల్లికి 30 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపనున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకాకుళంలో ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాల కార్యక్రమం జరిగింది. భారతీయ రిజర్వ్ బ్యాంకు, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం చైతన్య భారతి కార్యాలయం వద్ద జరిగింది. చైతన్య భారతి మేనేజర్ ఆర్. సునిత్ మాట్లాడుతూ పొదుపు, బడ్జెట్, ఫైనాన్సియల్ సర్వీస్, డిజిటల్ సేవలు, సైబర్ నేరాలను వివరించారు. ఎస్ఎస్‌టీ కౌన్సిలర్స్ ఎం. సూర్యచంద్రరావు, పి. రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత-నైతికతపై ముస్లిం మహిళల ప్రచారం



మచిలీపట్నంటౌన్: జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం మహిళలు నగరంలోని పలు ప్రాంతాల్లో మానవత–నైతికత యాత్రలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ గురువారం ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మానవతా విలువలతో జీవించాలని చెప్పారు. జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం మచిలీపట్నం శాఖ ప్రతినిధులు సాబెరా, షేహ్నాజ్, తరన్నుమ్ తదితరులు పాల్గొన్నారు.